నమస్తే తెలంగాణ
# సూర్యాపేట
5 | నల్లగొండ, మంగళవారం 20 ఆగస్టు 2024 | SURYAPET

## సాగర్ క్రస్ట్ గేట్ల మూసివేత

నందికొండ, ఆగస్టు 19 : నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు వరద తగ్గిపోవడంతో డ్యామ్ క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదలను సోమవారం ఎన్నెస్పీ అధికారులు నిలిపివేశారు. ఈ ఏడాదిలో ఆగస్టు 5న మొదటి విడుత క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదలను ప్రారంభించి 12 వరకు వరుసగా 8 రోజులు పాటు కొనసాగించారు. మరల రెండో విడుత 14న నీటి విడుదలను క్రస్ట్ గేట్ల ద్వారా ప్రారంభించి 19 వరకు 6 రోజుల పాటు విడుదల చేశారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 14 రోజుల పాటు క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదలను కొనసాగించారు. ఇంకా ఆగస్టు, సెప్టెంబర్‌లో కూడా వరద వచ్చే అవకాశం ఉండడంతో మళ్లీ క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగే అవకాశం ఉందని ఎన్నెస్పీ అధికారులు తెలిపారు. నాగార్జునసాగర్ డ్యామ్ నుంచి ఎడమకాల్వకు 5,367, కుడికాల్వకు 8,067, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 26,796, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది. నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు 42,630 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అదే స్థాయిలో అవుట్ ఫ్లో కొనసాగుతున్నది.

## సంబురంగా రాఖీ వేడుక

అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనురాగానికి ప్రతీక అయిన రక్షాబంధన్ వేడుకలను సోమవారం జిల్లా వ్యాప్తంగా సంబురంగా జరుపుకొన్నారు. సోదరులకు రాఖీలు కట్టి ఆడబిడ్డలు ఆశీర్వచనాలు అందించారు. స్వీట్లు తినిపించుకొని కుటుంబంతో సంతోషంగా గడిపారు.


హైదరాబాద్‌లో తన నివాసంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డికి రాఖీ కడుతున్న ఆయన సోదరి కట్టా రేణుక

# ఎండుతున్న ఏఎంఆర్‌పీ ఆయకట్టు

### పాలకుల పర్యవేక్షణ లోపం... అందని సాగునీరు

- సముద్రం పాలవుతున్న సాగర్ నీళ్లు
- నాలుగు మోటార్లకు ప్రస్తుతం నడిచేదే మూడే
- ముందుచూపు లేక మరమ్మతుకు నోచుకోని నాలుగో మోటారు
- ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్‌కు నిధుల కొరత
- నీళ్లున్నా ఎందుకివ్వరంటూ రైతుల ఆగ్రహావేశాలు
- కాల్వల వద్ద నీళ్ల కోసం రైతుల మధ్య పోరు
- ఇద్దరు మంత్రులున్నా పట్టింపులేదంటున్న రైతన్నలు

నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 19(నమస్తే తెలంగాణ) : దేవుడు వరమిచ్చినా పూజారి అడ్డుకున్న చందంగా ఉందన్నది ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు(ఏఎంఆర్‌పీ) ఆయకట్టు రైతుల పరిస్థితి. కృష్ణానది ఉగ్రరూపం దాల్చి ప్రాజెక్టులను ముంచెత్తి సముద్రంలో వృథాగా కలిసిపోతుంటే ఆ నీటిని సకాలంలో పొలాలకు మళ్లించలేని దుస్థితి నెలకొంది. నాగార్జునసాగర్ నుంచి నీటిని ఎత్తిపోసి ఏఎంఆర్‌పీ ద్వారా సాగునీరు అందించాల్సి ఉండగా దాని ఊసే లేకుండా పోయింది. పాలకులకు ముందు చూపు కొరవడడంతో సీజన్ ముంచుకొచ్చినా నేటికి మోటార్ల మరమ్మతులు పూర్తి కాకపోవడం గమనార్హం. దీంతో ఏఎంఆర్‌పీలో నాలుగు మోటార్లకు గానూ మూడు మోటార్లే రన్ అవుతుండడంతో కాల్వల్లో సాగునీరు పారడం లేదు. దీంతో రైతుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్నది. కాల్వల్లో వస్తున్న అరకొర నీళ్ల కోసం రైతుల మధ్య, ఊర్ల మధ్య ఘర్షణలకు ఆజ్యం పోసినట్లు అవుతుంది. ఓ వైపు లక్షల క్యూసెక్కుల నీళ్లు సముద్రంలోకి వృథాగా పోతుంటే 1,800 క్యూసెక్కుల నీరు ఏఎంఆర్‌పీ ఆయకట్టుకు ఇవ్వలేకపోతున్నారని రైతులు మండిపడుతున్నారు.


త్రిపురారం మండలం బొర్రాయిపాలెంలో నీరందక ఎండిపోతున్న నారుమడి

### కాల్వల్లో పారని నీరు

ప్రస్తుతం ఏఎంఆర్‌పీ ఆయకట్టు పరిధిలోని ప్రధాన డిస్ట్రిబ్యూటరీలకు మాత్రమే నీటిని విడుదల చేశారు. వీటికి కూడా అరకొర నీటినే వదులుతున్నారు. దీంతో డిస్ట్రిబ్యూటరీల్లోని నీరు సైతం మధ్య వరకు కూడా వెళ్లడం లేదు. డిస్ట్రిబ్యూటరీ చివరలోని రైతులు ఆందోళనలకు దిగుతున్నారు. ఇక డిస్ట్రిబ్యూటరీల నుంచి నీటిని గ్రామాలకు మళ్లించేందుకు రైతులు కాల్వకట్టల పైకి వస్తున్నారు. దీంతో మంగళవారం గుర్రంపోడు మండల పరిధిలోని కొప్పోలు వద్ద డి-25 వద్ద కొప్పోలు, తుర్కపల్లి గ్రామాల రైతుల నీటికోసం ఘర్షణలకు దిగారు. ఇదే విధంగా డి-40 పరిధిలోని మాడ్గులపల్లి మండల రైతులు తిప్పర్తి మండల రైతులతో వాదులాటలకు దిగుతున్నారు. ఏఎంఆర్‌పీ ప్రధాన కాల్వలో కనీసం 1200 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తేనే అన్ని కాల్వలకు సాగునీరు సమృద్ధిగా పారనుంది. కానీ ప్రస్తుతం 800 క్యూసెక్కుల నీరు కూడా రాకపోవడంతో రైతుల మధ్య గొడవలకు ఆస్కారం ఏర్పడుతున్నది.


గుర్రంపోడ్ : నీటి కోసం గొడవ పడుతున్న కొప్పోలు,తుర్కపల్లి గ్రామాల రైతులు

నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో నిండుగా నీళ్లు ఉన్నప్పుడు పుట్టంగండి నుంచి నాలుగు మోటార్లతో 2400 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తూ అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను నింపడమనేది సహజమైన ప్రక్రియ. అక్కడి నుంచి 600 క్యూసెక్కుల నీటిని హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం మిగతా 1800 క్యూసెక్కుల నీటిని ప్రధాన కాల్వ ద్వారా నల్లగొండ జిల్లాలోని తాగు, సాగునీటి అవసరాలు తీర్చాల్సి ఉంది. అయితే వేసవిలో నీటి లభ్యత సరిగ్గా లేని నేపథ్యంలో రెండు లేదా మూడు మోటార్ల నడిపి కేవలం తాగునీటి అవసరాలకే అందిస్తుంటారు. అయితే ఇదే సమయంలో నడపని మోటార్ల రిపేర్లు లేదా మెంయిటనెన్స్ పనులు ఉంటే సీజన్ ప్రారంభానికి పూర్తి చేయాల్సి ఉంటుంది. దీనివల్ల జూలై చివరి లేదా ఆగస్టు ప్రారంభంలో సాగర్‌కు వరద వస్తే నాలుగు మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోసి తాగు, సాగునీటి అవసరాలకు ఉపయోగించవచ్చు.

### మరమ్మతులకు నిధుల కొరత?

ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ నిధులను విడుదల చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీజన్ ముంచుకొస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. నిధులు రాకపోవడంతో అధికారులు సైతం ఏమి చేయలేక మిన్నకుండిపోయినట్లు సమాచారం. దీంతో ఏఎంఆర్‌పీ మొదటి యూనిట్ క్యాపిటల్ ఓరాలింగ్‌లో భాగంగా గత రెండు మాసాలుగా నడపడం లేదు. గతంలో సాగర్ నీటి మట్టం తక్కువ ఉన్నా వేసవిలోనే ఓరాలింగ్ పూర్తి చేస్తే సాగర్‌కు వరదలు వచ్చే నాటికి మోటార్లు వినియోగంలోకి వచ్చేవి. వీటి మరమ్మతుల టెండర్ల నిర్వహణలోనూ తీవ్ర జాప్యం చేసినట్లు తెలుస్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇలాంటి పనులన్నీ సీజన్ మొదలయ్యే నాటికే పూర్తి చేసి ఏ మాత్రం నీళ్లు వచ్చినా ఆ నీటిని అటు తాగునీటికి ఇటు సాగునీటికి మళ్లించేవారు. కానీ నేడు పాలకుల అవగాహనా రాహిత్యానికి అధికారుల నిర్లక్ష్యం తోడు కావడంతో సాగర్ నీళ్లు సముద్రంలో కలుస్తున్నా ఏఎంఆర్‌పీ ఆయకట్టుకు మాత్రం అందడం లేదు. గత ఆదివారం డిండిలో జిల్లా ఇరిగేషన్ సమీక్ష సమావేశంలో దీనిపై మంత్రి ఉత్తమ్ ఆరా తీసి ఆదేశించడంతో ప్రస్తుతం అధికారులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ఎంత చేసినా కనీసం మరో 15రోజుల తర్వాతే నాలుగో మోటార్ అందుబాటులోకి వస్తుందని అధికారులు చెబుతుండడం గమనార్హం.

### ఆందోళనల్లో రైతులు

ఏఎంఆర్‌పీ పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే సాగు నీరు అందడం లేదని ఆయకట్టు రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. మంగళవారం ఆయకట్టు పరిధిలోని రైతులు మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. కలెక్టర్ నారాయణరెడ్డికి తమ పరిస్థితిని విన్నవిస్తూ తక్షణమే సాగునీటిని విడుదల చేయాలని విన్నవించారు. అసలే గత వేసవిలోనూ ప్రభుత్వ నిర్లక్ష్యంతో చెరువులు నింపకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి వేలాది ఎకరాల్లో పండ్ల తోటలు సైతం ఎండిపోయాయి.

### ప్రభుత్వ పర్యవేక్షణేది?

రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉమ్మడి నల్లగొండ జిల్లాకే చెందినా ఏఎంఆర్‌పీ ప్రాజెక్టుపై పర్యవేక్షణ లేదన్నది నిజం. మరోవైపు పొద్దున లేస్తే ఎల్ఎల్‌బీసీ సొరంగమార్గంపై గొప్పులు చెప్పే మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సైతం ఇక్కడే ఉన్నా ఆయనకు ఏఎంఆర్‌పీ పట్టలేదు. ఇక ఏఎంఆర్‌పీ ఆయకట్టులో మెజార్టీ భాగం కోమటిరెడ్డి నియోజకవర్గంలోనే ఉన్నా... దీనిపై మంత్రిగా ఏనాడు దృష్టి సారించలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో అధికారులు సైతం తీవ్ర నిర్లక్ష్యంతో ఉన్నారు. ఫలితంగా నాలుగో మోటార్ రిపేరుకు నోచుకోలేదు. అది పనిలోకి రావాలంటే కనీసం మరో పక్షం రోజులు పడుతుందని అధికారులే చెబుతున్నారు. సాగర్ నిండే సమయానికి అక్కంపల్లి రిజర్వాయర్‌ను నింపాల్సి ఉంది. కానీ ప్రస్తుతం 1.50 టీఎంసీల సామర్థ్యానికి గానూ కేవలం 0.83టీఎంసీల నీరే నిల్వ ఉంది. వాస్తవంగా ప్రస్తుతం మూడు మోటార్లతో 1,800 క్యూసెక్కుల నీటిని అక్కంపల్లి రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. ఇక ఇందులో 600 క్యూసెక్కుల నీరు హైదరాబాద్ తాగునీటికి తరలిస్తున్నారు. మరో 1000 క్యూసెక్కుల నీటిని ప్రధాన కాల్వ ద్వారా పానగల్ ఉదయ సముద్రం నింపుతున్నారు. మరో 200 క్యూసెక్కుల నీటిని పలు డిస్ట్రిబ్యూటరీలకు వదులుతున్నారు. అయితే అక్కంపల్లికి వస్తున్న నీటినంతా వెంటనే తరలిస్తుండడంతో అక్కంపల్లిలో నీటిమట్టం పెరుగడం లేదు. దీనివల్ల అక్కంపల్లి రిజర్వాయర్ నుంచి నేరుగా సాగునీరు అందాల్సిన డి-7బీ డిస్ట్రిబ్యూటరీ కాల్వలోకి నీరు పారడం లేదు. దీంతో తలాపునే నీళ్లు ఉన్నా రైతుల పొలాలు బీళ్లుగానే దర్శనం ఇస్తున్నాయి. ఇక ఇలాగే ప్రధాన కాల్వ వెంట ఉన్న అనేక డిస్ట్రిబ్యూటరీ కాల్వలన్నీ నీళ్లు రాక వాటి పరిధిలోని భూములు దుక్కులుగానే ఉన్నాయి. వాస్తవంగా ఏఎంఆర్‌పీ పరిధిలో నేరుగా కాల్వల ద్వారా పంట పొలాలకు నీళ్లు ఇచ్చేది తక్కువే. దీని పరిధిలోని చెరువులు, కుంటలు నింపడమే ప్రధాన లక్ష్యం. తద్వారా భూగర్భజలాలు పెరుగడంతో బావులు, బోర్లలో నీరు సమృద్ధిగా వచ్చి వరితో పాటు తోటలు సాగుచేస్తుంటారు.

### మూడు మోటార్ల ద్వారా నీటి విడుదల : ఏడీఈ సుధాకర్

ప్రస్తుతం ఏఎంఆర్‌పీ ప్రాజెక్టు నుంచి నాలుగు మోటార్లగానూ మూడు మోటార్ల ద్వారా నిరంతరం నీటి విడుదల కొనసాగుతున్నది. మొదటి యూనిట్ క్యాపిటల్ ఓరాలింగ్‌లో భాగంగా రన్నర్ మార్పిడి పనులు వేగవంతం చేస్తున్నాం. ఈ నెల చివరనాటికి పనులు పూర్తి చేసి మొదటి యూనిట్ రన్ చేస్తాం. ఇందుకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. అవి పూర్తయితే నాలుగు మోటార్లు అందుబాటులోకి వస్తాయి.

### పోసిన నారు ఎండిపోతున్నా నీరు అందట్లే



సాగర్ జలాశయం నిండుకుండలా ఉన్నా ఏఎంఆర్‌పీకి సాగు నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గత యాసంగి పంటలకు సైతం భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లు పోయడం లేదు. ఇప్పుడేమో పుష్కలంగా నీరు ఉన్నా కాల్వలను నిర్లక్ష్యంగా వదిలి వేయడంతో అవి పూడిపోయాయి. నాకు డీ-40 కాల్వ పరిధిలో 6 ఎకరాల భూమి ఉంది. ఇప్పటి వరకు కేవలం 3 ఎకరాలు మాత్రమే నాటుపెట్టిన. ఇంకా మూడున్నర ఎకరాలు నారు పోసి ఉంది. సకాలంలో నీరు వదలకపోవడంతో నారుమండి ఎండిపోయే పరిస్థితి వచ్చింది. మూడు నాలుగు రోజుల క్రితం వదిలినట్లు చేశారు అంతే. పర్యవేక్షణ లేక నీరు మాత్రం అందడం లేదు.

-ముతినేని లక్ష్మీనారాయణ, రైతు, చిన్నసూరారం, నల్లగొండ మండలం

### నీటిని నమ్ముకొని నారు వేశాం



ఏఎమ్మార్పీలో డి-19కి నీరు ఎక్కడం లేదు. 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న మొసంగి చెరువుకు బ్రహ్మణగూడెం, చేపూర్ గ్రామాల ద్వారా నీళ్లు రావాల్సింది. ఈ నీటిని నమ్ముకుని రైతలందరూ వరి నార్లు వేసుకున్నారు. నీరు వస్తేనే నాటు వేసేది. చెరువు నిండితేనే భూగర్భ జలాలు పెరిగి నాట్లు వేస్తారు. గత ప్రభుత్వంలో ప్రతి సీజన్‌లో మొసంగి పెద్ద చెరువు అలుగుపోసేది. కాని ఈ ప్రభుత్వంలో నీరు ఇంత వరకు చెరువులోకి రాలేదు.

- నడ్డి సైదులు యాదవ్, రైతు, మొసంగి, గుర్రంపోడు

### తూములకు నీరు చేరడం లేదు



ఏఎమ్మార్పీలో డి-22కి నీరు ఎక్కడం లేదు. నడికూడ గ్రామ కాల్వలోకి చుక్క నీరు చేరలేదు. ఇక చివరి భూములకు నీరు చేరేదెప్పుడో అధికారులకే తెలియాలి. బుధవారం సాయంత్రం కూడా డి-22 వద్దకు వద్ద చూస్తే గేటు ఎత్తి ఉన్నా నీరు తూము దాటడం లేదు.ఈ సారి ఆశించదగ్గ వర్షాలు లేకపోయినా పై రాష్ట్రాలలో కురిసిన వర్షాలకు నాగార్జునసాగర్ పూర్తి స్థాయిలో నిండిన కాలువ ద్వారా చెరువులను నింపకపోడం ప్రభుత్వం ముందుచూపు లేని తనం.ఇప్పటికైనా కాలువల ద్వారా చెరువులను నింపి రైతులలను ఆదుకోవాలి.

- పామనగుండ్ల వెంకన్న, రైతు, నడికూడ, గుర్రంపోడు

## చివరి ఆయకట్టుకు నీరు అందించాలని రైతుల నిరసన

### అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై రాస్తారోకో
### పెద్ద ఎత్తున నిలిచిపోయిన వాహనాలు

మాడ్గులపల్లి, ఆగస్టు 19 : చివరి ఆయకట్టు నీళ్లు అందించాలని అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో రైతులు సోమవారం మాడ్గులపల్లి మండల కేంద్రంలో అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ 18 రోజులుగా వరదకాల్వకు నీటిని రాష్ట్ర మంత్రులు విడుదల చేయగా చివరి ఆయకట్టుకు నీరందడం లేదన్నారు. వరదకాల్వలో కంపచెట్లు, పిచ్చి మొక్కలు, రాళ్లు, వ్యర్థాలతో నిండిపోవడంతో నీరు అందక పంటలు ఎండిపోయే దుస్థితి ఏర్పడిందన్నారు. మాడ్గులపల్లి, దాచారం, చెరువుపల్లి, ఇందుగుల, మర్రిగూడెం, తోపుచర్లలో చివరి భూములకు నీరందకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. సాగర్‌లో నిండుగా నీళ్లున్నా చివరి ఆయకట్టుకు నీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. విషయం తెలుసుకున్న తాసీల్దార్ పద్మ అక్కడికి చేరుకొని డీఈతో ఫోన్‌లో మాట్లాడి చివరి భూములకు నీరందించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకోను విరమించారు. కార్యక్రమంలో నాయకులు అశోక్‌రెడ్డి, శ్రీకర్, మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, భూపతిరెడ్డి, చారి, సుధాకర్‌రెడ్డి, అశోక్, వెంకన్న పాల్గొన్నారు.



మాడ్గులపల్లి మండల కేంద్రంలోని అద్దంకి -నార్కట్‌పల్లి రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు


చివ్వెంల మండలం గుంజలూరులో రుణమాఫీ కాలేదని చెబుతున్న చెట్టు కింద కూర్చున్న రైతులు

## రుణమాఫీ ఉత్తముచ్చట్నే!

- జాబితాల్లో పేర్లున్నా మాఫీ కాలె
- ఇంకా మొదటి, రెండో విడుత దగ్గరే..
- పలు కొర్రీలతో నిలుపుదల
- గుంజలూరులో 1,030 మందికి 348 మందికే మాఫీ
- కొంత మందికే ఎలా చేస్తారని రైతుల ఆగ్రహం

సూర్యాపేట, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ) : రైతు రుణమాఫీ అందరికీ కాలేదు. ఒక్కో గ్రామంలో సగానికిపైగా రానివారే ఉన్నారు. ప్రభుత్వం చెప్పే మాటలకు.. చేసిన పనితీరుకు పొంతనే ఉండటం లేదు. వంద శాతం అమలు చేశామని సర్కారు చెబుతుంటే.. సగం మందికి మాత్రమే అయినట్లు లెక్కలు చెబుతున్నాయి. అన్ని అర్హతలు ఉన్నా రుణ విముక్తి కాకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. నేడు గ్రామాల్లో ఎక్కడ నలుగురు గుమిగూడినా రుణమాఫీ మీదే చర్చలు నడుస్తున్నాయి. చివ్వెంల మండలం పరిధి గుంజలూరు గ్రామంలో నమస్తే తెలంగాణ ప్రతినిధి పర్యటిస్తే 70 శాతం మందికి రుణమాఫీ కాలేదని రైతులు చెబుతున్నారు. గ్రామంలో ఓ చెట్టు కింద నిలబడ్డ కొప్పు కోటమ్మ అనే మహిళను కదిలిస్తే 'ఏందయ్యా మాఫీ మాకు లక్ష రూపాయల అప్పు ఉంటే ఇంకా కాలేదు..ఎప్పుడు చేస్తరని అడిగితే ఏ అధికారి కూడా సమాధానం చెప్పట్లేదు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. పక్కనే ఉన్న గన్న పిచ్చయ్యతో మాట్లాడితే తనకు 80వేల అప్పు ఉంటే మాఫీ కాలేదని, ఆ పక్కనే ఉన్న మరో రైతు కీత లక్ష్మీనర్సయ్యను పలుకరిస్తే లక్ష అప్పు ఉంటే మూడు విడుతలుగా ఎదురు చూసినా మాఫీ కాలేదన్నాడు. ఇలా గ్రామంలో ఎవరిని అడిగినా చాలా మంది రుణమాఫీ కాలేదంటూ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారు. గ్రామంలో 1,030 మంది రైతులు ఉంటే 348 మందికే మాఫీ అయ్యింది.

### గుంజలూరులో 30 శాతమే ..

వాస్తవానికి ఎవరికి రుణమాఫీ అయిందనేది కచ్చితమైన సమాచారం ఏ అధికారి బహిర్గతం చేయకుండా ఒకరిపై మరొకరు దాటవేస్తున్నారు. మూడు విడుతల్లో వచ్చిన జాబితా ప్రకారం గుంజలూరు గ్రామంలో 30శాతం మంది రైతులకే రుణాలు మాఫీ అయినట్లు స్పష్టంగా కనిపిస్తుంది. రెండు లక్షల లోపు మూడో విడుత ప్రకటన చేసినప్పటికీ గ్రామంలో ఒక్కరికీ కూడా మాఫీ అయిన దాఖలాలు లేవు. ఈ గ్రామంలో 1,030 మంది రైతులు ఉంటే మొదటి విడుతలో లక్ష లోపు 142 మందికి, రెండో విడుతలో 173 మందికి రుణమాఫీ అయ్యింది. రెండు లక్షలలోపు 33 మందికి మొత్తం కలిపి గ్రామంలో 348 మందికి రుణమాఫీ అయినట్లు రికార్డులు స్పష్టం చేస్తుండగా మిగిలిన 682 మందికి కాలేదని రైతులే చెబుతున్నారు. ఈ 348లో కూడా రెండు లక్షల లోపు రుణాలు మాఫీ అయినట్లు గ్రామంలో ఒక్కరు కూడా చెప్పకపోగా ఇంకా కొంత మందికి జాబితాలో పేరు ఉన్నా డబ్బులు పడలేదని చెబుతున్నారు.

### 50 వేలు కూడా మాఫీ కాలే



నాకు మా గ్రామ శివారులో 2.30 ఎకరాలు భూమి ఉంది. గత ప్రభుత్వం హయాంలో మాకు ఎనభై వేల రూపాయలు మాఫీ చేసింద్రు. ఇప్పుడు మాకు బ్యాంకులో యాభై వేల రూపాయలే అప్పు ఉంది. మూడు విడుతలుగా ఎదురుచూస్తున్నా మాఫీ కాలే. మాలాంటి పేద రైతలకు న్యాయం చేయాలి. మాఫీ చేస్తం అని చెప్పి మమ్ములను మోసం చేస్తే రైతుల ఉసురు తగులుద్ది. బ్యాంకుకు వెళ్తే సరైన సమాధానం చెప్తలేరు. కొద్దిపాటి రుణం కూడా మాఫీ కావట్లేదు. అసలు అవుతదో కాదో తెలువట్లేదు.

- బొల్లికొండ చిన్న నాగయ్య, గుంజలూరు

### రుణమాఫీ అయితదని ఎదురు చూసిన



నాకున్న నాలుగు ఎకరాల వ్యవసాయ భూమిపై లక్షా 80 వేలు రుణం తీసుకున్న. గతేడాది కేసీఆర్ ప్రభుత్వంలో లక్ష రూపాయలు మాఫీ చేసింద్రు. మిగిలిన 80 వేలు మాఫీ అవుద్దని 8 నెలల సంది ఎదురు చూస్తున్నం. మొదిటి విడుతలో కాలేదు రెండో విడతలోనైనా అవుద్దనుకున్నా. కానీ మూడో విడుత జాబితాలో కూడా నాపేరు లేదు. బ్యాంకుల్లో ఏం చెప్పట్లేదు. ఇప్పటికే ప్రభుత్వం రైతు భరోసా పెట్టుబడి సాయం ఇవ్వలేదు. అప్పులు చేసి నాట్లు వేసినం. ఎరువులు కూడా అప్పులు చేసి తెచ్చుకున్నం.

-జటంగి సైదులు, రైతు గుంజలూరు


నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్ వద్ద కురుస్తున్న వర్షం

## కురిసింది వాన

- జిల్లా అంతటా మోస్తరు నుంచి భారీ వర్షం

నీలగిరి, ఆగస్టు 19 : గత కొన్ని రోజులుగా ఊరిస్తున్న వాన ఎట్టకేలకు కురిసింది. జిల్లాలో వర్షం కురువక ఒక వైపు రైతులు, మరోవైపు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఎండ తీవ్రత కారణంగా అల్లాడుతున్న జనానికి ఉపశమనం కలిగించేలా సోమవారం సాయంత్రం జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉక్కపోత ఉండగా సాయంత్రం కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడింది. కొన్ని రోజులు వానలు రాకపోవడంతో ఎండాకాలాన్ని తలపించింది. పంటలకు సరిపడా నీళ్లు లేక ఎండుముఖం పట్టాయి. ఈ వర్షం పత్తితోపాటు ఇతర పంటలకు మేలు చేసింది. నల్లగొండ జిల్లా కేంద్రంలో సుమారు గంటలపాటు భారీ వర్షం పడింది. శాలిగౌరారం, కట్టంగూర్, నకిరేకల్, హాలియా, నార్కట్‌పల్లి, నిడుమనూరు, గుర్రంపోడు మండలాల్లో భారీ వర్షం కురిసింది. త్రిపురారం, పెద్దవూరలో ఓ మోస్తరు.. కొండమల్లేపల్లి, చింతపల్లి, నాంపల్లిలో తేలికపాటి వర్షం పడింది. కేతేపల్లి మండలంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. మిగతా ప్రాంతాల్లో కూడా ఉరుములతో కూడిన చిరుజల్లులు పడ్డాయి.

### గుర్రంపోడులో కూలిన కోళ్ల షెడ్డు.. 5 వేల కోళ్లు మృతి

- ఇటుకుల మధ్య చిక్కుకున్న యజమానిని కాపాడిన గ్రామస్తులు

గుర్రంపోడు : సోమవారం సాయంత్రం గంటసేపు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి మండలంలోని పిట్టలగూడెంలో రామసాని నరేందర్‌రెడ్డికి చెందిన కోళ్ల షెడ్డు కుప్పకూలింది. అందులో ఉన్న నరేందర్‌రెడ్డి మీద ఇటుక గోడ కూలింది. ఇందులోని 5 వేల కోడి పిల్లలు మృతి చెందాయి. పక్కనే షెడ్డులో ఉన్న కుటుంబ సభ్యులు గ్రామస్తులకు సమాచారం అందించగా వారు వచ్చి నరేందర్‌రెడ్డిని బయటకు లాగి కాపాడారు. నరేందర్‌రెడ్డికి తీవ్ర గాయాలతోపాటు కాలు విరిగిపోగా నల్లగొండ దవాఖానకు తరలించారు. పిట్టలగూడెం, కొప్పోలు, గుర్రంపోడు, రామలోనిబావి, వట్టికోడు తదితర గ్రామాల్లోనూ భారీ వర్షం కురిసింది.